సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం । 13 । నవంబర్ । 2024



సూక్ష్మ శివలింగం


తుని: కార్తిక మాసం సందర్భంగా తునికి చెందిన స్వర్ణకారుడు కె.కోటేశ్వరరావు 100 మిల్లీగ్రాముల బంగారంతో సూక్ష్మ శివలింగాన్ని రూపొందించారు. ఇది అందరినీ ఆకట్టుకుంటోంది.



మరిడమ్మకు వెండి వడ్డాణం

పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారి ఉత్సవ మూర్తికి గేదెల వీర వెంకట సూర్య కిరణ్, నిహారిక దంపతులు (పెద్దాపురం) మంగళవారం 167 గ్రాముల వెండి వడ్డాణం సమర్పించారు.

22 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 22,392 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ నీటిమట్టం 10.10 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 3,600 క్యూసెక్కుల నీరు వదిలారు.

న్యూస్‌రీల్

పెనుగొండలో అంతర్జాతీయ తెలుగు సదస్సు



బ్రోచర్ విడుదల చేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య శ్రీనివాసరావు తదితరులు

రాజానగరం: పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ నెల 27, 28 తేదీల్లో అంతర్జాతీయ తెలుగు సదస్సు నిర్వహించనున్నారు. ఆదికవి నన్నయ, మద్రాస్ యూనివర్సిటీలతో కలిసి ఈ కళాశాల సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహిస్తోంది. దీనిని 'విశ్వర్షి వాసిలి వాఙ్మయ వరివస్య' అనే అంశంపై నిర్వహిస్తున్నారు. సదస్సు బ్రోచర్‌ను నన్నయ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మద్రాస్ యూనివర్సిటీ తెలుగు విభాగం మొదటి బ్యాచ్‌లో ఎంఏ చదివిన డాక్టర్ విశ్వర్షి వాసిలి వసంత కుమార్ కలం నుంచి 50కి పైగా పుస్తకాలు వెలువడ్డాయని చెప్పారు. కాలమిస్టుగా, పత్రికా సంపాదకునిగా, రచయితగా, యోగా సాధకునిగా ఐదు దశాబ్దాలుగా ఆయన సుపరిచితులని, ఆయన వాఙ్మయంపై విస్తృత పరిశోధనలు జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ అప్పారావు, తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య రంకిరెడ్డి రామ్మోహనరావు, నన్నయ వర్సిటీ తెలుగు విభాగాధిపతి, సదస్సు కన్వీనర్ డాక్టర్ కేవీఎన్‌డీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి తెప్పోత్సవం

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి తెప్పోత్సవం బుధవారం సాయంత్రం 7 గంటలకు స్థానిక స్వామివారి కోనేటిలో నిర్వహించనున్నారు. అన్నవరం దేవస్థానం సూపరింటెండెంట్ వెంకట రమణ మంగళవారం ఈ విషయం తెలిపారు. అన్నవరం దేవస్థానం ఆధ్వర్యాన జరిగే ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పరాశర రంగరాజ బట్టర్ తదితరులు పాల్గొంటారన్నారు. దీనికి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామన్నారు. తెప్పోత్సవ ఏర్పాట్లను కోరుకొండ ఎస్సై శ్యామ్‌సుందర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పంటుపైకి 15 మందికి మించి ఎక్కరాదని స్పష్టం చేశారు.

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఆర్ట్స్ కళాశాలలో రిసెప్షన్ కేంద్రం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు మెటీరియల్ తరలించేందుకు స్థానిక ఆర్ట్స్ కళాశాలలో రిసెప్షన్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఈ విషయం తెలిపారు. ఆర్ట్స్ కళాశాల, ఎస్కేవీటీ డిగ్రీ కళాశాలను డీఆర్ఓ, ఆర్డీఓలతో కలసి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రతి మండలంలో ఒక్కొక్కటి చొప్పున, రాజమహేంద్రవరం అర్బన్‌లో రెండు కలిపి జిల్లా వ్యాప్తంగా 20 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని వివరించారు. పోలింగ్ మెటీరియల్‌తో, ఎన్నికల సిబ్బంది ఆర్ట్స్ కళాశాల నుంచి డిసెంబర్ 4న బయలుదేరి, వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించామని కలెక్టర్ తెలిపారు.

టీఈసీసీతో ఆదిత్య యూనివర్సిటీ ఒప్పందం




ఒప్పంద పత్రాలు చూపిస్తున్న టీఈసీసీ ప్రతినిధులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆదిత్య యూనివర్సిటీతో తైపీ ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్ (టీఈసీసీ) విద్యా విభాగం మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ వివరాలను యూనివర్సిటీ ప్రో చాన్సలర్ ఎన్.సతీష్ రెడ్డి తెలిపారు. ఈ ఒప్పందంతో సాంస్కృతిక, విద్యా మార్పిడిని పెంపొందించడానికి అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థుల్లో మాండరిన్ భాషా నైపుణ్యాలను పెంపొందించడం, ఉద్యోగావకాశాల కోసం వారి అభ్యాసన అనుభవాన్ని, భాషా నైపుణ్యాలను మెరుగుపరచడానికి వీలు కలుగుతుందని వివరించారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ డాక్టర్ పీఎస్ రంజిత్, డివిజన్ డైరెక్టర్ పీటర్స్ చెన్, తైవాన్ రాయబారి భౌషువాన్ గెర్, సీఈఓ శ్రీవిజయ కొమార్ ఒప్పంద పత్రంపై సంతకాలు చేశారన్నారు. ఈ ఒప్పందం ద్వారా తైవాన్ పరిశ్రమలకు ప్రత్యేకమైన విద్యా వనరులు, విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు.

అవస్థలు అపారం

- 'ఒకే దేశం – ఒకే స్టూడెంట్' నినాదంతో అపార్ కార్డుల జారీకి సన్నాహాలు
- ఆధార్ వివరాలు ప్రామాణికంగా రూపకల్పన
- అందులోని విద్యార్థుల వివరాల్లో తప్పులు
- నవీకరణ కోసం పరుగులు
- అప్‌డేట్‌కు బర్త్ సర్టిఫికెట్ అడుగుతున్న ఆధార్ కేంద్రాల నిర్వాహకులు
- గ్రామీణులకు తప్పని ఇబ్బందులు
- జిల్లాలో ముందుకు సాగని ప్రక్రియ



అపార్ కార్డు

సాక్షి, రాజమహేంద్రవరం: 'ఒకే దేశం – ఒకే స్టూడెంట్ కార్డు' నినాదంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానంలో భాగంగా తీసుకుని వచ్చిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) విద్యార్థుల ను అవస్థలకు గురి చేస్తోంది. ఈ విధానంపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడంతో ఏం చేయాలి, ఎలా నమోదు చేసుకోవాలనే అంశాలపై గందరగోళం నెలకొంది. స్పష్టమైన విధానం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వెరసి జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్ల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయా కేంద్రాల వద్ద గంటల తరబడి వేచి ఉండి మరీ వారు వివరాలు నమోదు చేయించుకుంటున్నారు.

ఇదీ సంగతి

దేశంలో పౌరుల గుర్తింపునకు ఆధార్ కార్డు ఉన్నట్లే.. విద్యార్థులకు అపార్ కార్డు తీసుకుని వచ్చేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. ఈ ఆలోచన బాగానే ఉన్నా ఆచరణకు వచ్చేసరికి విద్యార్థుల వివరాల నమోదులో సమస్యలు తలెత్తుతున్నాయి. ఆధార్ కార్డులోని వివరాలను ప్రామాణికంగా తీసుకుని విద్యార్థులకు అపార్ కార్డు తయారు చేస్తున్నారు. ఇక్కడే అసలు సమస్య తలెత్తుతోంది. ఆధార్ కార్డులో తప్పుల తడకగా నమోదైన వివరాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. చాలా మంది విద్యార్థుల పుట్టిన వివరాలు.. ఆధార్ కార్డులో ఉన్న వివరాలకు పొంతన ఉండటం లేదు. విద్యార్థి వివరాలను పాఠశాలలోని అడ్మిషన్ రిజిస్టర్‌తో పాటు యూడైస్‌లో పొందుపరిచారు. అపార్ నమోదు సమయంలో ఆధార్ కార్డు వాడటంతో.. అందులోని పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు వంటి వివరాలు అడ్మిషన్ రిజిస్టర్, యూడైస్‌లతో పోలిస్తే వేర్వేరుగా ఉంటున్నాయి. దీంతో అపార్ నమోదులో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి.

కార్డు పొందితే..

కేంద్రం సూచించిన విధంగా కేజీ నుంచి పీజీ వరకూ చదువుకునే ప్రతి విద్యార్థికీ గుర్తింపు సంఖ్య ఇవ్వనున్నారు. అపార్ కార్డుపై క్యూఆర్ కోడ్‌తో పాటు 12 అంకెల గుర్తింపు సంఖ్య ఉంటుంది. ఒక విద్యార్థికి కేటాయించిన గుర్తింపు సంఖ్య మరొకరికి ఉండదు. ఆధార్ కార్డు తరహాలో ఒకే సంఖ్య ఉంటుంది. కార్డు పొందిన విద్యార్థి ఎక్కడి నుంచైనా ప్రవేశాలు పొందే వెసులుబాటు కలుగుతుంది. ఈ క్రమంలో అపార్ నమోదు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. తొలి దశగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లోని 9, 10 తరగతుల విద్యార్థులకు కార్డులు జారీ చేసేందుకు కేంద్ర విద్యా శాఖ మార్గదర్శకాలు వెలువరించింది. ఆధార్, అపార్, బ్యాంక్ అకౌంట్, పాన్‌కార్డులు అన్నీ లింక్ అయి ఉంటాయి. అపార్ కార్డులో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, జెండర్, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెల గుర్తింపు సంఖ్య ఉంటాయి. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే విద్యార్థికి సంబంధించిన ఈ వివరాలతో పాటు మార్కులు, గ్రేడ్లు, ఉపకార వేతనాల వివరాలు, అవార్డులు, డిగ్రీలు, క్రీడలు, ఇతర అంశాల్లో సాధించిన విజయాలతో పాటు విద్యా సంబంధిత వివరాలతో సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు వివరాలన్నీ తెలుసుకునేలా అపార్ కార్డు రూపుదిద్దుకుంటోంది.

బలవంతంగా నమోదు చేస్తున్నారు



కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అపార్ విధానంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థలు ఏది విధానాలపై అవగాహన కల్పించడం లేదు. బర్త్ సర్టిఫికెట్‌లో తప్పులు సరి చేయడంపై దృష్టి పెట్టడం లేదు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు బలవంతంగా నమోదు చేయిస్తున్నాయి.

– వై.భాస్కర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

అడ్డంకిగా ఆధార్ సమస్యలు

అపార్ కార్డు రూపకల్పనకు ఆధార్ కార్డులో ఉన్న సమస్యలు అడ్డంకిగా మారాయి. వీటిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం చొరవ చూపడం లేదు. గత నెల 22 నుంచి 25 వరకూ ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అయితే ఈ కేంద్రాల్లో కేవలం ఫోన్ నంబర్ అప్‌డేట్ వంటి చిన్న చిన్న సమస్యలకు మాత్రమే దిద్దుబాటు చేపట్టారు. తండ్రి పేరు, పుట్టిన రోజు వివరాల్లో తప్పులుంటే సరి చేసేందుకు జనన ధ్రువీకరణ పత్రాలు అడుగుతున్నారు. అవి లేని విద్యార్థులు అపార్ నమోదుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికిప్పుడు బర్త్ సర్టిఫికెట్ పొందే అవకాశం లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించిన వారికి బర్త్ సర్టిఫికెట్ ఆస్పత్రిలోనే జారీ చేస్తుండగా.. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల వద్ద పుట్టిన వారికి బర్త్ సర్టిఫికెట్ తలనొప్పిగా మారుతోంది. ఈ నేపథ్యంలో అపార్‌లో నమోదు చేసే ముందు ఆధార్ కార్డు, స్కూలు అడ్మిషన్ రిజిస్టర్‌లలో వివరాలు ఒకేలా ఉన్నాయో లేదో సరిచూసుకోవడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు. బర్త్ సర్టిఫికెట్ అవసరమైన వారు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా అరిగేలా తిరుగుతున్నారు. ఇదే అదనుగా నోటరీల కోసం డబ్బు వసూలు చేస్తున్నారు. ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లలో విపరీతమైన రద్దీ, విద్యార్థుల నుంచి ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు సుమారు 1,004 ఉన్నాయి. వీటిల్లో 2 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం వందల సంఖ్యలో మాత్రమే అపార్ కార్డు నమోదు జరిగినట్లు చెబుతున్నారు.

సమర్థవంతంగా నీటి సరఫరా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

- ఆ దిశగా చర్యలు తీసుకోవాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- గైర్హాజరుపై ఆగ్రహం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సాగు, తాగు అవసరాలతో పాటు పరిశ్రమలకు పూర్తి స్థాయిలో నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని, ఆ దిశగా జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన ఈ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నీటి పారుదల సలహా మండలి సమావేశాన్ని మొక్కుబడిగా నిర్వహించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పశ్చిమ డెల్టా డీఈ గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న సమావేశానికి సమన్వయ శాఖలతో పాటు సంబంధిత ఇరిగేషన్ అధికారులు కూడా పూర్తి నివేదికలతో హాజరు కావాలని ఆదేశించారు. సమావేశానికి ఇరిగేషన్ అధికారులకు బదులు దిగువ స్థాయి సిబ్బందిని పంపడం, నివేదికలు సమర్పించడంలో వారికి అవగాహన లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత ఎస్ఈలు, ఈఈలు, సమన్వయ శాఖల అధికారులతో తదుపరి సమావేశం నిర్వహించాలని స్పష్టం చేశారు. తూర్పు, పశ్చిమ, సెంట్రల్ డెల్టాల్లో క్షేత్ర స్థాయిలో సమస్యలు, పరిష్కార మార్గాలతో కూడిన నివేదికలు అందజేయాలన్నారు. వాటిని అధ్యయనం చేసి, ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేయాలని చెప్పారు. సాగునీటి అవసరాలపై మండల వ్యవసాయ అధికారుల నుంచి వివరాలు తీసుకుని, నివేదిక తయారు చేయాలన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖలు, తాగునీటి అవసరాలపై మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పారిశ్రామిక నీటి అవసరాలపై నివేదిక అందించాలన్నారు. ఎర్ర కాలువ, కొవ్వాడ, చింతలపూడి, తొర్రిగెడ్డ, సీతానగరం ప్రాజెక్టుల ఈఈలు తమ పరిధిలో సీజన్ల వారీగా సాగు విస్తీర్ణం, సాగు నీరు అందించడంలో సమస్యలపై నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. జిల్లా నీటి పారుదల శాఖ అధికారి జి.శ్రీనివాసరావు, కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత, వ్యవసాయ అధికారి మాధవరావు పాల్గొన్నారు.

ఇసుక కోసం పడిగాపులు

- తీపర్రు ర్యాంపులో ఇసుక ఎగుమతి చేయని నిర్వాహకులు
- వందలాదిగా నిలిచిన లారీలు, ట్రాక్టర్లు
- పాత బాటలో ఉచిత ఇసుక లోడింగ్‌ను అడ్డుకున్న అధికారులు
- ఇరువర్గాల మధ్య వాగ్వాదం

పెరవలి: మండలంలోని తీపర్రు ర్యాంపు వద్దకు వందలాది లారీలు, ట్రాక్టర్లతో వచ్చిన వారు మంగళవారం ఇసుక కోసం పడిగాపులు పడ్డారు. లారీలకు, ట్రాక్టర్లకు ర్యాంపు నిర్వాహకులు ఇసుక ఎగుమతి చేయలేదంటూ డ్రైవర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వందలాది వాహనాలతో ర్యాంప్ బాట పూర్తిగా నిండిపోయింది. దీంతో రైతులు సైతం ఇబ్బందులు పడ్డారు. అదే సమయంలో ఉచిత ఇసుక కోసం వచ్చిన ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులు పక్కనే ఉన్న పాత బాటలోకి వెళ్లి లోడ్ చేసుకోవడం ఆరంభించారు. దీనిపై లారీ డ్రైవర్లు ఆగ్రహించారు.

అడ్డుకున్న తహసీల్దార్

విషయం తెలియడంతో తహసీల్దార్ డి.అచ్యుత కుమారి అక్కడకు చేరుకుని, ట్రాక్టర్ల డ్రైవర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చూపి న బాటలోకి వెళ్తాంటే కాంట్రాక్టరు ఇసుక ఎగుమతి చేయడం లేదని, ఉచిత ఇసుక తీసుకుని వెళ్లకుండా ఎందుకు అడ్డు తగులుతున్నారని ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులు ఎదురు నిలదీశారు. ఈ క్రమంలో అధికారులు, ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులు సుమారు గంటపాటు పరస్పరం కేకలు వేసుకున్నారు. ఒక దశలో ఎవరు ఎవరిని ఏమి అడుగుతున్నారో తెలియని గందరగోళ పరిస్థితి ఏర్పడింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి, వాహనాలను అడ్డుకుని, ఇసుక ఎగుమతి చేయరాదని కూలీలను హెచ్చరించారు. దీనిపై ట్రాక్టర్ల యజమానులు మరింత ఆగ్రహించారు. ఏం తప్పు చేశామని తమను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. ఈ వివాదంతో పశ్చిమ గోదావరి, కాకినాడ జిల్లాల నుంచి ఇసుక కోసం వచ్చిన వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోయాయి.

అధికారులపై డిప్యూటీ కలెక్టర్ ఆగ్రహం

అదే సమయంలో డిప్యూటీ కలెక్టర్ ఖతీబ్ కౌసర్ బానో ర్యాంప్ వద్దకు చేరుకున్నారు. 'ఉదయం నుంచీ ఇసుక లోడ్ చేయకుండా ఏం చేస్తున్నారు? ఇంత మంది సిబ్బంది ఉండి పట్టుమని 10 లారీలు కూడా ఎగుమతులు చేయలేదంటే మీరంతా ఎందుకున్నట్టు? నేను ఫోన్ చేస్తూంటే ఇసుక లోడింగ్ జరుగుతోందని ఎందుకు చెప్పారు? వాస్తవ పరిస్థితి ఎందుకు చెప్పలేదు? ఇక్కడ చూస్తే ఎటువంటి లోడింగ్ జరగడం లేదు' అంటూ అధికారులపై మండిపడ్డారు. లారీలకు వెంటనే ఇసుక ఎగుమతి చేయాలని ఆదేశించారు. ఇంతలో ట్రాక్టర్ల యజమానులు ఆమెను చుట్టుముట్టారు. తమకు అవసరమున్నప్పటికీ ర్యాంపులోకి వెళ్తే ఇసుక ఎగుమతి చేయటం లేదని చెప్పారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ అచ్యుత కుమారిని డిప్యూటీ కలెక్టర్ ఆదేశించారు.

లంకల వద్ద తవ్వకాలు వద్దు

అదే సమయంలో పలువురు రైతులు కూడా తమ గోడు వెళ్లబోసుకున్నారు. లంకల పక్కనే ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని, దీనివలన వరదల సమయంలో లంకలు కోతకు గురై, తమ పంట పొలాలు గోదావరిలో కలసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ మైనింగ్ విభాగం ఇచ్చిన సర్వే నంబర్లు ఎక్కడున్నాయో కొలతలు వేయాలని సర్వేయర్‌ను ఆదేశించారు. వారి సర్వే ప్రకారం ప్రస్తుతం నీటి ప్రవాహం ఉన్న ప్రాంతంలో ఇసుక తవ్వాల్సి ఉందని తేలింది. దీంతో కంగు తిన్న అధికారులు చివరకు ప్రస్తుతం తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాల్లోనే ట్రాక్టర్లతో ఇసుక తీసుకుని వెళ్లవచ్చని చెప్పారు.



ర్యాంపు వద్ద నిలిచిన లారీలు

బాటలో గట్టు వేసిన కాంట్రాక్టర్

అధికారుల నిర్ణయాన్ని కాంట్రాక్టర్ వ్యతిరేకించారు. తాము వేసుకున్న బాట ద్వారా ఇసుక ఎలా తరలిస్తారని, తాము రెండు జిల్లాలకు ఇసుక సరఫరా చేయాల్సి ఉందని చెప్పారు. తమ బాటలోకి రావటానికి వీలు లేదంటూ గట్టు వేశారు. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. దీంతో ర్యాంపులో తలెత్తిన సమస్యను స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. అనంతరం మంగళవారం ఒక్క రోజూ అందరూ ఒకే బాట నుంచే తవ్వకాలు జరుపుకోవాలని ఆదేశించడంతో మధ్యాహ్నం 3 గంటల నుంచి ఇసుక ఎగుమతులు ప్రారంభమయ్యాయి.



తీపర్రు ర్యాంపులో అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ ఖతీబ్ కౌసర్ బానో



తీపర్రు ర్యాంప్‌లో ట్రాక్టర్లను అడ్డుకుంటున్న అధికారులు

టీడీపీ నేతల జేబులు నింపడానికే ఇసుక పాలసీ

- మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆరోపణ
- సామాన్యులకు ఇసుక అందుబాటులోకి తేవాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న తలారి వెంకట్రావు, చిత్రంలో కోడూరి శివరామకృష్ణ తదితరులు

కొవ్వూరు: కేవలం టీడీపీ నాయకుల జేబులు నింపడానికే ఉచిత ఇసుక పాలసీ అని, వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పటికంటే రెట్టింపు ధరలకు ఇసుక విక్రయిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు ఆరోపించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నేతలకు ఇసుక పాలసీ ఆదాయ వనరుగా మారిందన్నారు. నియోజకవర్గంలో రోజు వారీగా 20 వేల టన్నుల ఇసుక సేకరించే అవకాశం ఉన్నప్పటికీ 3 వేల టన్నులు మాత్రమే సేకరిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఓపెన్ రీచ్‌ల టెండర్లు సైతం తుతూ మంత్రంగా వేశారని అన్నారు. ఇసుక సొమ్ము ఎమ్మెల్యేకి ఇంత ఇవ్వమన్నారంటూ వీడియోలు బయటకు వస్తున్నాయన్నారు. వినియోగదారులకు ఇసుక అందకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు సైతం పూర్తి స్థాయిలో పనులు దొరకని పరిస్థితి నెలకొందన్నారు. వర్షాకాల అవసరాల కోసం నిల్వ ఉంచిన ఇసుకను ఎన్నికలు ముగిసిన వెంటనే స్టాక్ పాయింట్ నుంచి తరలించి దోచుకున్నారన్నారు. 2014–19 మధ్య ఇసుక దోపిడీ విధానాన్నే ప్రస్తుతం అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సామాన్యులకు అవసరమైన ఇసుకను ట్రాక్టర్లతో తీసుకెళ్లవచ్చునని మంత్రి, ముఖ్యమంత్రి చెబుతున్నప్పటికీ టీడీపీ నేతల ఆధ్వర్యంలో ఇసుక తరలింపులకు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పడవల ర్యాంపుల్లో బోట్స్‌మెన్‌కు ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సామాన్యులను ఇసుక అందుబాటులోకి తీసుకుని రావాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, నాయకులు కంఠమణి రమేష్‌బాబు, నగ్గిపాటి శ్రీనివాస్, చిట్యూరి అన్నవరం, కౌన్సిలర్లు అంకోలు వెంకట లిల్లీ పద్మలీల, తోట లక్ష్మీప్రసన్న, చీరా అరుణ కుమారి, కో ఆప్షన్ సభ్యులు ఏలూరి వెంకట్, ఎండీ ఆలీ పాల్గొన్నారు.

రేపటి నుంచి డీఈఎల్‌ఈడీ సప్లిమెంటరీ ఫైనల్ ప్రాక్టికల్స్

రాజమహేంద్రవరం రూరల్: డీఈఎల్ఈడీ 2018–20 (స్పాట్ అండ్ మేనేజ్‌మెంట్) బ్యాచ్ మొదటి సంవత్సరం తెలుగు, గణితం సప్లిమెంటరీ ఫైనల్ ప్రాక్టికల్స్ గురు, శుక్ర, శనివారాల్లో జరగనున్నాయి. వివరాలకు బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ (డైట్) కార్యాలయంలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ ఏఎం జయశ్రీ తెలిపారు. ఇవే రోజుల్లో డీఈఎల్ఈడీ 2023–25 బ్యాచ్ (ప్రభుత్వ, ప్రైవేట్) రెండో సెమిస్టర్ తెలుగు, గణితం సప్లిమెంటరీ ఫైనల్ ప్రాక్టికల్స్ కూడా జరుగుతాయని వివరించారు.